## క్లుప్తంగా

### వామనావతారంలో జనార్దన స్వామి



జనార్దన స్వామివారు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని శ్రీ భూ, నీళా సమేత శ్రీ జనార్దన స్వామి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారికి విశేష పూజలు చేశారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, తిరుప్పావై సేవా కాలం నిర్వహించారు. అనంతరం భక్తుల గోత్రనామాలతో అష్టోత్తర పూజలు చేశారు. స్వామివారు శ్రీ వామనావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. ఆలయ అర్చకుడు వంగల పవన్ కుమార్ విశేష పూజలు నిర్వహించగా, కార్యనిర్వహణాధికారి గుబ్బల రామ పెద్దింట్లరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

### ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి




కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న దళితులు, గిరిజనులు

ఏలూరు (టూటౌన్): ప్రభుత్వ భూములను భూమి లేని పేదలకు పంచాలని, అసైన్డ్, సీలింగ్ భూముల ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుని భూములను స్వాధీనం చేసుకోవాలని కోరుతూ ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన దళితులు, గిరిజనులు బుధవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వానికి చెందిన గయ్యాళి, అసైన్డ్, సీలింగ్ భూములు ఆక్రమణలకు గురయ్యాయన్నారు. గత 25 ఏళ్లల్లో ఎన్నడూ లేని విధంగా భూస్వాములకు నకిలీ పత్రాలు సృష్టించుకుని కోర్టులు, రెవెన్యూ అధికారులను తప్పుదోవ పట్టించి గిరిజనుల భూములను లాగేసుకోవాలని చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో భూపోరాట నాయకులు అనుమోలు మురళి, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా నాయకులు మడకం సుధారాణి, పూనం సూర్యారావు, రామలక్ష్మి, చెల్లమ్మ, సోయం దుర్గ, బరగడ కుమారి తదితరులు పాల్గొన్నారు.



ఏలూరు 15వ డివిజన్‌లో బ్యాడ్మింటన్ ఆడుతున్న కార్పొరేటర్ తంగెళ్ల రాము



గుడివాకలంకలో జరిగిన వాలీబాల్ మ్యాచ్‌లో తలపడుతున్న క్రీడాకారులు

# ఉత్సాహంగా ‘ఆడుదాం ఆంధ్రా’

**సచివాలయ స్థాయిలో ఆటల పోటీలు**

ఏలూరు రూరల్: ఏలూరు నగరంతో పాటు రూరల్ గ్రామాల్లో ‘ఆడుదాం ఆంధ్రా’ క్రీడా పోటీలు రెండో రోజు బుధవారం ఉత్సాహంగా జరిగాయి. నగరంలో స్థానిక కార్పొరేటర్లు పోటీల్లో పాల్గొని క్రీడాకారులను ఉత్సాహం నింపారు. కార్పొరేషన్ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ పలు శాఖల అధికారులను డివిజన్ల వారీగా ఆటల పోటీలకు పరిశీలకులుగా నియమించారు. 15వ డివిజన్ నగరపాలక పాఠశాలలో జరిగిన పోటీల్లో స్థానిక కార్పొరేటర్ తంగెళ్ల రాము బ్యాడ్మింటన్ ఆడి క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. ఇంజినీరింగ్ శాఖ డీఈ కొండలరావు పోటీలను పర్యవేక్షించారు.

**గ్రామాల్లో పోటీలు :** ఏలూరు రూరల్ గ్రామాల్లో ఎంపీడీఓ బి.ప్రణవి పర్యవేక్షణలో పోటీలు జరిగాయి. జాలిపూడి,గుడివాకలంక, శ్రీపర్రు, చాటపర్రు గ్రామాల్లో బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు.

### వైద్య శాఖలో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**నేటి నుంచి వచ్చేనెల 12వ తేదీ వరకు అవకాశం**

ఏలూరు(మెట్రో): ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకుడు, జోన్-2 రాజమహేంద్రవరం పరిధిలోని ఎంఎల్‌హెచ్‌పీ/సీహెచ్‌ఓ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేశారని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి శర్మిష్ట బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నోటిఫికేషన్‌కు సంబంధించిన వివరాలు జోన్-2 పరిధిలోని ఏలూరు జిల్లా వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు డీఎంహెచ్‌ఓ తెలిపారు. సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో జోన్-2 ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకుల కార్యాలయంలో ఈనెల 28 నుంచి జనవరి 12వ తేదీ వరకూ దరఖాస్తులు సమర్పించాలన్నారు. దరఖాస్తులను ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకుడు జోన్-1, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ ప్రాంగణంలో సమర్పించవచ్చని ఆ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## నేటి నుంచి సప్తాహాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం నుంచి స్వామివారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాలు ప్రారంభవుతాయని దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ తోలేటి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం దేవస్థానంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి 5వ తేదీన లక్ష కుంకుమార్చన, 7న శ్రీ సుదర్శన హోమం, 9న స్వామివారికి నవనీత అలంకరణ, 13న లక్ష తులసి పూజ, 14న గోదా కళ్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 29న ప్రముఖ ఆధ్యాత్మిక ప్రసంగీకులు చాగంటి కోటేశ్వరరావు ప్రవచనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసిరావు మాట్లాడుతూ స్వామివారికి స్వర్ణ శంఖు చక్రాలు చేయించడానికి ఇప్పటికే సుమారు 1,700 గ్రాముల బంగారాన్ని దాతలు సమర్పించారని, ఆ బంగారంతో శంఖు చక్రాలు చేయించడానికి తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులతో సంప్రదింపులు చేస్తున్నామన్నారు. దీనికి టీటీడీ ట్రస్ట్ బోర్డు సభ్యుడు నెరుసు నాగసత్యం ఎంతగానో సహకరిస్తున్నారన్నారు. ఉత్సవాలు జనవరి 17వ తేదీతో ముగుస్తాయని ముగింపు సందర్భంగా జనవరి 20న భారీ అన్నసమారాధన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు కిళాంబి మారుతి శ్రీనివాస రామానుజాచార్యులు మాట్లాడుతూ ఉత్సవాల ప్రారంభం సందర్భంగా గురువారం ఉదయం విశేష పూజలు నిర్వహిస్తామన్నారు. అనంతరం ఉత్సవాల ప్రారంభ సూచికగా వివిధ ధ్వజాల ఆవిష్కరణ నగర ప్రముఖులతో నిర్వహిస్తున్నామన్నారు. ఉత్సవాలు కొనసాగే మూడు వారాల్లో ప్రతి రోజూ స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుందన్నారు. అలాగే ప్రతి రోజూ సాయంత్రం ఆధ్యాత్మిక ప్రవచనాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో దేవస్థానం ట్రస్టీలు కిలారపు శ్రీనివాసరావు, చోడే శివసాయి కృష్ణ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో పాల్గొన్న దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్, ట్రస్టీలు, ఈఓ, అర్చకులు

## గొర్రెలు, మేకల పెంపకందార్ల సంక్షేమానికి కృషి

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలోని గొర్రెలు, మేకల పెంపకందార్ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని గొర్రెల, మేకల పెంపకందార్ల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పొట్టేలు పెంటయ్య అన్నారు. స్థానిక ఏటిగట్టు ప్రాంతంలోని జిల్లా యాదవ సంఘం కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 2017లో నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకాన్ని తీసుకువచ్చిందని, ఈ పథకం గొర్రెలు, మేకల పెంపకంలో బడా పెట్టుబడిదారులను ప్రోత్సహించేలా ఉందన్నారు. దీని వల్ల సాంప్రదాయ పెంపకందార్లు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం పొంచి ఉందన్నారు. గొర్రెలు, మేకల పెంపకందారులకు 90 శాతం సబ్సిడీతో రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు రుణాలు మంజూరు చేయాలని కోరారు. గొర్రెలు, మేకల సహకార సంఘాల జిల్లా యూనిట్‌లకు నూతనంగా ఏర్పడిన జిల్లాల ఆధారంగానే ఎన్నికలు నిర్వహించి అనంతరం రాష్ట్ర ఫెడరేషన్ ఎన్నికలు జరపాలని కోరారు. బ్రీడింగ్ పాలసీని తీసుకువచ్చి గొర్రెల, మేకల అభివృద్ధికి నాణ్యమైన విత్తన పొట్టేళ్లను అందించాలని, 50 ఏళ్లు నిండిన ప్రతి పెంపకందారునికి రూ.6 వేలు పెన్షన్ అందించాలని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికైన ఏలూరు సమీప గ్రామం చాటపర్రుకు చెందిన పొట్టేలు పెంటయ్యను జిల్లా యాదవ సంఘం ఆధ్వర్యాన సత్కరించారు. రాష్ట్రంలోని గొర్రెలు, మేకల పెంపకందార్ల ప్రయోజనాలు కాపాడేలా పెంటయ్య పనిచేయాలని జిల్లా యాదవ సంఘం నాయకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో యాదవ సంఘ జిల్లా అధ్యక్షుడు చిదరబోయిన శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉక్కుసూరి గోపాలకృష్ణ, గౌరవాధ్యక్షులు కిలారపు బుజ్జి, గొర్ల రామారావు, బొట్టా అజయ్ కుమార్, ఆకుల గంగాధర్, పశ్చిమ గోదావరి జిల్లా గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘ అధ్యక్షుడు ఆగొల్లు కృష్ణారావు, చిట్టిబోయిన సాయి, బోగా రాజేష్, చిలకంటి గంగాధర్, బోయిన చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పొట్టేలు పెంటయ్య

## కష్టపడి పనిచేస్తే సముచిత స్థానం

**ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్**

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు రాజ్యాధికారంలో భాగస్వాములు కావాలని చేస్తున్న కృషి అభినందనీయమని ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ఇడా) చైర్మన్ బొద్దాని శ్రీనివాస్ అన్నారు. ఇడా చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్‌ను తణుకులో మర్యాద పూర్వకంగా కలిశారు. వారికి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ళ నాని సహకారంతో తనపై విశ్వాసంతో ఇడా చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



రాష్ట్ర మంత్రి కారుమూరి నాగేశ్వరరావును కలిసిన ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్

## ముగిసిన మాలధారులకు భిక్ష కార్యక్రమం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని పేరయ్య కోనేరు ప్రాంగణంలో నవంబర్ 18వ తేదీ నుంచి అన్నపూర్ణ సహిత హరిహర పుత్ర అయ్యప్ప స్వామి అన్నదాన సమాజం ఆధ్వర్యాన నిర్వహిస్తున్న మాలధారులకు భిక్ష కార్యక్రమం బుధవారంతో ముగిసినట్లు సమాజం అధ్యక్షుడు కొట్టు మధు తెలిపారు. బుధవారం పేరయ్య కోనేరు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంతో మంది దాతలు, భిక్షా ప్రదాతల సహకారంతో 50 రోజుల పాటు ప్రతి నిత్యం సుమారు 800 నుంచి 1000 మంది వరకూ అయ్యప్ప, భవాని, శ్రీ వేంకటేశ్వర స్వామి, ఆంజనేయ స్వామి, షిర్డీ సాయిబాబా తదితర మాలలు ధరించిన భక్తులకు భిక్ష కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ భిక్ష కార్యక్రమం నిమిత్తం నూకల రామకృష్ణ, అమ్మాజీ దంపతులు, ఎస్ఎంఆర్ పెదబాబు, గారపాటి సీతారామాంజనేయ చౌదరి, శలా రాజాబాబు, యడ్లపల్లి సుబ్బారావు, దింటకుర్తి సుబ్రహ్మణ్యం, యడవల్లి కోటి, పొలిమేర రాజు, వీరమాచనేని చందు, చలువాది పవన్‌కుమార్, సామర్ల కిరణ్, కొట్టు అప్పారావు, కొట్టు విజయ శంకర్, కొట్టు మధు వెంకట్రావు, కొట్టు మనోజ్‌లు శాశ్వత ధర్మకర్తలుగా కమిటీ ఏర్పాటు చేశామన్నారు. వీరితో పాటు అనేక మంది దాతలు ఈ భిక్ష కార్యక్రమం నిమిత్తం విరాళాలు అధిక మొత్తంలో సమర్పించి సహకరించారన్నారు. దాతల విరాళాలతో భిక్ష కార్యక్రమం నిర్విఘ్నంగా నిర్వహించామని, దాతలు ఇచ్చిన విరాళాల్లో మిగిలిన మొత్తం నుంచి పేరయ్య కోనేరు ప్రాంగణంలోని శ్రీ రామాలయంలో స్వామివారికి నిత్య ధూపదీప నైవేద్యాల నిమిత్తం రూ.51 వేలు, శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ నిర్వహించే నిత్యాన్నదాన కార్యక్రమానికి రూ.51 వేలు, నగర ప్రజల యోగక్షేమాల కోసం స్థానిక పడమర వీధిలోని గ్రామ దేవత శ్రీ గంగానమ్మ అమ్మవారి జలాభిషేకం నిమిత్తం రూ.51 వేలు సమర్పిస్తున్నామన్నారు. అలాగే భిక్షా ప్రదాతల నుంచి ఒక రోజు భిక్ష నిమిత్తం సేకరించిన రూ.10,116లో మిగిలిన రూ.2,016ను వారికి తిరిగి చెల్లించేస్తున్నట్లు చెప్పారు.



విరాళాల్లో మిగిలిన మొత్తాన్ని దాతలకు చెల్లిస్తున్న కమిటీ ప్రతినిధులు

## కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

| కూరగాయలు | కిలో ధర | కూరగాయలు | కిలో ధర |
|---|---|---|---|
| టమాటాలు | 28 | అరటి కాయ (1) | 07-10 |
| వంకాయలు (గులాబీ) | 44 | చిక్కుడు కాయలు | 108 |
| వంకాయలు (కాంతులు) | 48 | బీన్లచిక్కుడు | 128 |
| వంకాయలు (తెలుపు) | -- | చామదుంపలు | 50 |
| బెండకాయలు | 56 | ములక్కాడలు | 10-15 |
| పచ్చిమిర్చి | 40 | కంద | 54 |
| కాకర కాయలు | 50 | బీట్‌రూట్ | 40 |
| బీరకాయలు | -- | కీర దోస | 36 |
| బీరకాయలు (పందిరి) | 70 | ఫ్రెంచ్‌బీన్స్ | 76 |
| క్యాబేజీ | 20-25 | అల్లం | 128 |
| క్యారెట్ | 44-60 | కొత్తిమీర (కట్ట) | 18 |
| దొండకాయలు | 70 | పాలకూర | 12 |
| బంగాళదుంపలు | 26 | చుక్కకూర | 12 |
| ఉల్లిపాయలు | 33 | తోటకూర | 12 |
| గోరుచిక్కుడు | 64 | గోంగూర | 08 |
| దోసకాయలు | 60 | పుదీనా | 05 |
| అనబకాయ (1) | 30-40 | క్యాప్సికమ్ | 90 |
| పొట్లకాయ(1) | 20-25 | చిలకడదుంప | 30 |

## అభివృద్ధిని వేగవంతం చేయాలి

ఏలూరు రూరల్: రూర్బన్ నిధులతో అభివృద్ధిని వేగవంతం చేయాలి స్టేట్ కో ఆర్డినేటర్ త్రినాథ్ కోరారు. బుధవారం ఆయన మరో కో ఆర్డినేటర్ వినోద్‌తో పాటు మండల పరిషత్ ఇంజినీరింగ్ అధికారి ఏఈ కృష్ణమోహన్‌తో కలిసి ఏలూరు రూరల్ గ్రామాలైన కోటేశ్వరదుర్గాపురం, ప్రత్తికోళ్లలంక, జాలిపూడి, గుడివాకలంక గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో కోట్ల రూపాయల రూర్బన్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, ప్రహరీల అభివృద్ధి పనులను పరిశీలించారు. ఇంజినీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. నాణ్యతా ప్రమాణాలు తప్పక పాటించాలన్నారు. అభివృద్ధి పనులు వేగంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అవసరమైతే మరిన్ని రూర్బన్ నిధులతో పనులు చేపట్టాలని సూచించారు. అనంతరం ఆయన జెడ్పీ సీఈఓ కె.సుబ్బారావును కలిసి పనులపై చర్చించారు. ఎంపీడీఓ బి.ప్రణవి పనులను త్రినాథ్‌కు వివరించారు.



చాటపర్రులో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని ఫాదర్ తోట అంథోని పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక బీడీ కాలనీలో ఏలూరు సెంట్రల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన సెయింట్ అంథోని పాఠశాలలో జరిగిన మొక్కలు నాటే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భూమిపై స్వచ్ఛమైన పర్యావరణం, ఆరోగ్యకరమైన ప్రాణ వాయువు కావాలంటే ఖచ్చితంగా మొక్కలు పెంచాలని సూచించారు. మొక్కల ద్వారా వాతావరణ సమతుల్యత ఏర్పడుతుందని స్పష్టం చేశారు. అలాగే అటవీ ప్రాంతాన్ని సంరక్షించుకోవాలని, వీలైనంతవరకూ ప్రతి ప్రాంతాన్ని పచ్చదనంతో నింపాలని సూచించారు. లయన్స్ జిల్లా గవర్నర్ గెట్టం మాణిక్యాలరావు ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏలూరు సెంట్రల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తోట ఎడ్వర్డ్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు చుక్క అవినాష్, సీహెచ్ కుమార్, తుమ్మల రవికుమార్, ఎస్.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.




మొక్కలు నాటుతున్న ఫాదర్ తోట అంథోని, క్లబ్ ప్రతినిధులు

## ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

### ఏసీ బస్సులు..

| బస్సు రూటు | సమయం | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|
| ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర) | 21.00 | 28 |
| ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర) | 21.00 | 29 |
| ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి) | 22.00 | 38 |
| ఏలూరు - తిరుపతి(ఇంద్ర) | 19.00 | 37 |

### సూపర్ లగ్జరీ

| బస్సు రూటు | సమయం | సర్వీస్ నంబర్ | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|---|
| ఏలూరు -బీహెచ్ఈఎల్ | 21.45 | 4820 | 26 |
| ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట | 19.30 | 4796 | 27 |
| ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం | 19.45 | 4798 | 15 |
| ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం | 21.00 | 4804 | 22 |
| ఏలూరు -ఈసీఐఎల్ | 22.30 | 4814 | 22 |
| ద్వారకాతిరుమల -ఏలూరు- బీహెచ్ఈఎల్ | 22.15 | 4822 | 25 |
| ఏలూరు - విశాఖపట్నం | 12.00 | 4840 | 36 |
| ఏలూరు -తిరుపతి | 16.00 | 4830 | 33 |

### నాయీ బ్రాహ్మణ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షునిగా చందు



నియామక పత్రాన్ని అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పుటూరి బాల గురుస్వామి

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర నాయీ బ్రాహ్మణ యువజన విభాగం ఉపాధ్యక్షునిగా ఏలూరుకు చెందిన తాతపూడి చందును నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పుటూరి బాల గురుస్వామి బుధవారం నియామక పత్రాన్ని అందజేశారు. విజయవాడలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా చందు మాట్లాడుతూ రాష్ట్రంలోని నాయీ బ్రాహ్మణుల సమస్యలపై నిరంతరం పోరాడతానని తెలిపారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు కొప్పెర్ల నాగరాజు, పొన్నాడ మురళి, పరిటాల వీరాస్వామి, పరిటాల దుర్గాప్రసాద్(కొండ), కొక్కిరిపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### పీఎంపీల సేవలు అభినందనీయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి ఎదురయ్యే ఆరోగ్య సమస్యలకు వైద్యం అందించే పీఎంపీల సేవలు అభినందనీయమని శ్రీ కృష్ణ హాస్పిటల్ వైద్యుడు డాక్టర్ బి.కృష్ణ అన్నారు. కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) 61వ వ్యవస్థాపక దినోత్సవాన్ని బుధవారం స్థానిక వైఎంహెచ్ఏ హాలులో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ కృష్ణ హాజరై మాట్లాడారు. వైద్యులు సేవా దృక్పథంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు మాట్లాడుతూ గతంలో పీఎంపీలుగా సేవలందిస్తున్న తమ సభ్యులు ఇకపై హెల్త్ కేర్ ప్రొవైడర్స్‌గా పిలవబడతారని స్పష్టం చేశారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తమకు శిక్షణ ఇచ్చి, పరీక్షలు నిర్వహించి గుర్తింపు కల్పించడానికి కృషి చేశారని, ఆయన అకాల మరణంతో తమకు ప్రభుత్వ గుర్తింపు వచ్చే దారులు మూసుకుపోయాయన్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా తమను గుర్తించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. తొలుత అతిథులు కేక్ కట్ చేసి సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.సుబ్బారావు, ఎం.జయరాము, కోశాధికారి సీహెచ్ సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు గంగుమళ్ళ రాంబాబు, నిడమర్తి జయసూర్య, కోనా చిన్నారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ బి.కృష్ణ